# అత్తలంతా ఇంతే

జె. భారతీభరత్

"అబ్బ....వెధవ కొంప....వెధవ బ్రతుకూను. అక్కడైతే కాలు కదపకుండా పువ్వుల్లో పెట్టి చూస్తారు''. రెండు రోజులనుంచీ జ్వరంతో పడి ఉన్న అన్నపూర్ణమ్మ సణుగుడికి వంటగదిలో ఉన్న కోడలు లలిత మనసు చివుక్కుమంది.

ఎవరబ్బా....అంత పువ్వుల్లో పెట్టి చూచేవాళ్ళు? ఉన్నవాళ్ళు ఒక్క కూతురు, ఒక్క కొడుకు.

ఈ ఇంట్లో ఆవిడ మాటకు ఎవరూ అడ్డు చెప్పడం ఉండదు.

ఇక కూతురు లక్ష్మి ఇంటికి వెళ్ళినా ఉండలేక నాలుగు రోజులకే తిరుగు ప్రయాణం.

లక్ష్మి అత్తగారికి నలుగురు కొడుకులు. అంతా ఉమ్మడి కుటుంబమూ, రైతాంగమూను.

ఒక్కో కొడుక్కీ ఇద్దరేసి ముగ్గురేసి పిల్లలు.

అత్తాకోడళ్ళకో, తోడికోడళ్ళకో, పిల్లలకో ఎవరో ఒకరికి ఆ ఇంట్లో పోట్లాట ఉండని రోజే ఉండదు.

కోడళ్ళచేత గొడ్డులా పని చేయించే రకం ఆ అత్తగారు.

అటువంటి ఇంట్లో పడ్డ లక్ష్మి ఈమెను పువ్వుల్లో పెట్టి చూడదు సరిగదా, కన్నతల్లి వచ్చిందని కాస్సేపు కూర్చుని మాట్లాడే తీరికే ఉండదు.

మరి అత్తయ్యగారు అలా తిట్టుకుంటున్నారేమిటి?

దూరపు బంధువులున్నా వాళ్ళలోనూ అంతలా పువ్వుల్లో పెట్టి చూచేవాళ్ళే లేరు.

ఐనా ఆవిడ బుద్ధే అంత. ఎంతగా చూస్తున్నా ఇంకా చూడలేదని సణుగుతూనే ఉంటుంది.

"లలితా....ఇటు రా వే....ఒక్కసారి వచ్చి వెళ్ళమ్మా.'' రెండురోజుల జ్వరంతో ఉపవాసం ఉన్నా, గట్టిగా నోరు చించుకుని అరుస్తున్న అత్తగారి అరుపులతో అన్నం ఉడుకుతున్నా పొయ్యి వదలి పరుగున వచ్చింది లలిత.

"కాస్త ఏదేనా కలిపి తీసుకురా. నీరసంతో చచ్చిపోతున్నా.'' కళ్ళుమూసుకొని ముఖం చూడనన్నట్లు ప్రక్కకు తిరిగి పడుకుంది.

"ఇక్కడ బత్తాయిరసం తీసుకు వచ్చి పెట్టానండి. మీరు తీసుకున్నారాండి?''

"ఆ...ఏం రసంలే. నీళ్ళేకదా. వెళ్ళు. ఆ రమణని ఇలా పిలుస్తావా? కాస్త కాళ్ళు పట్టాలి.''

అత్తగారి మాటలతో వీధి అరుగుమీదికి వచ్చింది.

లలితకు ఒక కూతురు, ఒక కొడుకు.

కూతురు రమణ నాలుగు, కొడుకు వాసు రెండు చదువుతున్నారు.

రోడ్డుమీద పిల్లలతో ఆడుకుంటున్న రమణను పిలుచుకొచ్చింది లలిత.

"నాన్నమ్మను వదిలి బయటకు వెళ్ళవద్దని చెప్పినా ఆటలకెందుకే పోతున్నావు? ఈసారి అక్కడినుంచి కదులు చెబుతా." బుంగమూతి పెట్టి భయంతో గబగబా ముసలావిడ కాళ్ళు నొక్కుతున్న ఎనిమిదేళ్ళ కూతురిని కోపంగా చూస్తూ, వంటగదిలోకి వచ్చింది లలిత.

"వెధవ పుల్లలు. వర్షానికి అన్నీ చెమ్మగిల్లిపోయాయి. అన్నం ఉడకడానికే గంట.'' తిట్టుకుంటూ నానిపోయిన అన్నం వార్చిపారేసింది.

అత్తగారికి కాఫీ కలపడానికి పొయ్యిమీద పాలగిన్నె పెట్టింది.

గొట్టంతో కంసాలి ఊదినట్లు తడి పుల్లలతో కాస్సేపు కుస్తీ పట్టి, రెండు బీరకాయలు కత్తిపీట ముందు వేసుకుని కూర్చుంది అత్తగారికి పెందలాడే భోజనం పెట్టాలని.

ఇంతలో "అమ్మా....నాన్నమ్మ పిలుస్తోంది'' అంటూ రమణ రావడంతో కత్తిపీట మీదినుంచి లేచింది.


ఎంత చూచినా ఇంకా చూడలేదనే అత్తగారన్నా, రేకుడబ్బావంటి ఆమె నోరన్నా, స్కూలునుంచి అరిచి అరిచి వచ్చిన కొడుకుతో తేనిపోనివి చెప్పుకొనే మాటలన్నా–ఒళ్ళు మండుతున్నా, భయపడుతూనే ఉంటుంది లలిత.


పెళ్ళి జరిగి తొమ్మిదేళ్ళయినా, తల్లి ఇష్టప్రకారం పనులు జరిపే భర్త రామారావుకు లలిత ఎప్పుడూ ఎదురు చెప్పలేదు.

తల్లి అంటే భక్తి, గౌరవం, ప్రేమ ఆయనకు ఎక్కువ–అని సరిపెట్టుకొనే స్వభావం లలితది.

వంటగది తలుపులు మూసి అత్తగారు ఉన్న చావడిలోనికి వచ్చింది.

"కడుపు నొప్పిగా ఉంది. కాస్త బయటకు తీసుకువెళ్ళు.'' ఎప్పటికప్పుడు అన్ని పనులూ చేయించుకుంటున్నా ఇంకా ఏమీ చెయ్యడం లేదు, చూడడంలేదు అని తిట్టుకొనే అత్తగారంటే కాస్త ఒళ్ళు మండుతున్నా, లేవదీసి చెయ్యి పట్టుకొని నడిపించి పెరట్లోకి తీసుకువచ్చి కూర్చోబెట్టింది.





కడుపునొప్పి అంటూ ఎంతసేపటికీ లేవక పోవడంతో "మీకు కాఫీ కలుపుదామని పొయ్యిమీద పాలగిన్నె పెట్టి వచ్చానండి. పాలు మరిగిపోతాయేమో చూచివస్తానండి!" అని అత్త గారితో చెప్పి. "రమణా నాన్నమ్మను చూస్తుండు" అని కూతురుతో చెప్పి హడావుడిగా వంటగదిలోకి వచ్చింది.

"చస్తే వదిలిపోను. మాయదారిచావు రావడం లేదు. ఎవరికోసం బ్రతకాలి? నేనంటే అందరికీ బరువేనమ్మా. నాగురించి మీకు పని ఎక్కువై పోతోంది!" సాగదీసుకుంటూ తనను తానే తిట్టుకుంటున్న అన్నపూర్ణమ్మ మాటలు లలిత విని పించుకోనే లేదు.

ఉన్న కాసిని పాలు మరిగిపోవడంతో మళ్ళీ పాలుపోసి పెట్టవలని వచ్చింది.

కాఫీ కలుపుతుంటే "అమ్మో....అమ్మో. నా కాలు విరిగిపోయిందమ్మో. కాస్సేపు నా దగ్గర ఉండకుండా పరుగెట్టిందమ్మో. నేనుచస్తే తని వదిలిపోతుందమ్మో. నన్ను చూచేవాళ్ళెవరమ్మో....లలితమ్మో....లలితమ్మో" అంటూ అరుస్తున్న అత్తగారి అరుపులతో ఏమయ్యిందిరా దేవుడా అనుకుంటూ ఆ పాలగ్లాసు అక్కడ పడేసి—పెరట్లోకి పరుగు పెట్టింది.

"అమ్మా....నాన్నమ్మ నడవలేనని కూర్చుండి పోయింది!" అంటున్న ఆ చిన్న పిల్లమీద గయ్ మంటూ మండిపడింది అన్నపూర్ణమ్మ.

"నోరుమూసుకోవే కుర్రకుంకా. నువెంత నంగ నాచివైపోయావే తల్లీ. పిల్లా నాచెయ్యి పట్టుకోవే అంటే నేను పట్టుకోను గోడ పట్టుకొనిరా అన్నది నువ్వేగదే? ఏమ్మా....లలితమ్మా....కాస్త చెయ్యి పట్టుకొని లేపుతావా ఇంకా గ్రుడ్లప్పగించి అలాగే చూస్తావా?" అంటున్న మాటలతో కంగారుగా అత్తగారి చెయ్యి పట్టుకొని లేవదీయబోయింది లలిత.

ముసలావిడ లేవాలని ప్రయత్నం చేసింది కాని లేవలేకపోయింది.

"ఊహూ... నేను లేవలేను. నువ్వే నెమ్మదిగా లేవదీయి" నేలమీద చతికిలబడిందినీరసంగా.

చచ్చేన్రా దేవుడా అనుకుంటూ పదినిమిషాలకు ఆమెను నిలబెట్టేసరికి లలితకు తల తిరిగింది. సన్నని లలిత కాళ్ళు, చేతులు తొటకూర కాడలయ్యాయి.

"హమ్మయ్య .... వెళ్ళమ్మా. కాఫీ పట్టుకురా." నీరసంగా మంచం మీద వాలి పోయింది అన్నపూర్ణమ్మ.

లలిత కాఫీ తెచ్చేసరికి 'ఊ....ఆఁ' అంటూ తనలో తానే సణుక్కుంటోంది.

"కాఫీ తెచ్చానండి. లేవదియ్యమంటారా" అడుగుతున్న లలిత మాటలకు కోపంగా, "అక్కడ పారేసి వెళ్లు. నేను లేస్తానులే. నీళ్ళే గదా ఏం పట్టు ఇచ్చి చస్తోందిలే. కాస్త పెంద లాడే వంటచేసి ఒక్క ముద్ద పెట్టమ్మా." అత్త గారి మాటలతో గ్లాస్ స్టూల్‌మీద పెట్టి వంట గదిలోకి వచ్చింది.

బీరకాయలు కోసి వేపుతుండగా "అమ్మా పిన్ని వచ్చిందే!" అంటూ ఇద్దరు పిల్లలూ జయ లక్ష్మి రెండు చేతులూ పట్టుకొని వచ్చారు.

లలిత పరుగున వచ్చి చెల్లెలిని రెండు చేతుల తోనూ సంతోషంగా చుట్టివేసింది.

అందరూ సంతోషంగా కబుర్లు చెప్పుకుంటుంటే కోడలు చెల్లెలు దిగిందన్న మాటతో అన్న పూర్ణమ్మ ముఖం మరీ మాడిపోయింది. అసలు నీరసంకన్నా ఈ విచారం ఎక్కువై గోడవైపుకు తిరిగి పడుకుంది.

అక్క అత్తగారిని పలకరించాలని జయలక్ష్మి వచ్చి అన్నపూర్ణమ్మ పడుకున్న మంచం మీదకు వచ్చి కూర్చుంది.

'అత్తయ్యగారండీ అత్తయ్యగారండీ' అంటూ రెండుసార్లు పిలిచినా అన్నపూర్ణమ్మ పలకలేదు.

రమణ, వాసు కూడా "నాన్నమ్మా పిన్ని వచ్చిందే!" అంటూ అరిచినా ఆమె లేవలేదు.

అత్తగారి నాటకం తెలిసిన లలిత నవ్వుతూ "రావే జయా! టీ త్రాగుదువుగాని." అంటూ చెల్లెలి చేయి పట్టుకొని తీసుకుపోయింది.

"పాపం చాలా నీరసపడిపోయారు." అన్న పూర్ణమ్మ బుద్ధి తెలిసిన జయలక్ష్మి నవ్వుతూ వెళ్ళిపోయింది. పిల్లలు కూడా వాళ్ళ వెనుకబడ్డారు.

వాళ్ళలా వెళ్ళిపోవడంతో ముసలమ్మగారిలో కదలిక, కంటిచూపు వచ్చాయి.

'ఆ వచ్చిందీ! సంసారమంతా గుల్ల. ఎవరో ఒకళ్ళు దిగుతూనే ఉంటారు. సత్రం సత్రం' మనసులోనే తిట్టుకుంది కోడలివైపు వాళ్ళను.

ఇంతలో హైస్కూల్లో టీచర్ పనిచేస్తున్న అన్నపూర్ణమ్మ ఒక్కగానొక్క కొడుకు "అమ్మా ఈపూట భోజనం చేస్తావా? ఒంట్లో ఎలా ఉంది?" అంటూ వచ్చి తల్లి మంచం మీద కూర్చున్నాడు.

అప్పుడే నీరసంగా కళ్ళు తెరచినట్లు, "వచ్చావా నాయనా రామం, ఏమిటోరా తలనొప్పి, కాళ్ళు లాగడం, కళ్ళు తిరగడం, కడుపునొప్పి, గుండె దడ. వెధవప్రాణం పోవడం లేదు నాయనా. రామం! నువ్వూ అలా నీరసంగా ఉన్నావేమిట్రా?" ప్రేమగా అన్నపూర్ణమ్మ తన చేతితో కొడుకు వీపు నిమిరింది.

"నాకేం రోగం! నేను బాగానే వున్నాను. పిల్లలతో అరచి అరచి రావడంతో నీరసంకాక ఇంకేముంటుంది! అది నాకు అలవాటైపోయింది. స్కూల్ లేకపోతే నాకేమీ తోచదు. టీ త్రాగి వస్తాను" అంటూ లేవబోయాడు.

"కాస్సేపు కూర్చో నాయనా." ఎంతో ప్రేమతో అతని చేయి పట్టుకుంది.

"ఆ బత్తాయిరసం త్రాగావా? గ్లూకోజ్ త్రాగుతున్నావా?"

"ఆ అన్నీ ఒకటే రుచిరా బాబూ. నీళ్ళ రుచే. త్రాగినా ఏం పట్టులే" నీరసంగా కళ్ళు మూసుకుంది.

"రామం! నీ మరదలు దిగిందిరా. అమలాపురం వెళ్తూ ఇక్కడ దిగిందట. కూడా మొగుడు రానేలేదు. రాజమండ్రినుంచి ఒక్కత్తీ వచ్చేసిందిరా! సిగ్గూ బిడియం లేవురా. ఆడదానికి ఎంత ధైర్యంరా నాయనా?"

తల్లి మాటలకు కాస్త చిరాకు కలుగుతున్నా "ఆ టేబ్లెట్ వేసుకున్నావా" అంటూ మాట మార్చేశాడు.

"ఊ వేసుకున్నాలే. ఆ అప్పా చెల్లెళ్ళేవో ఊసులాడుకుంటుంటే .... నాకెందుకు కాని – నాకింత ముద్ద పెందలాడే పెట్టమనరా. వెళ్ళి నువ్వు రెండు తిడితేనేగాని అది పెట్టదురా నాయనా!"

"ఆఁ! అలాగే వెళ్ళి కేకలేస్తానుండు" అంటూ లేవబోయాడు.

"అన్నట్టు మరిచిపోయాను. జయ పెళ్ళి అయ్యాక ఇదే రావడం. అప్పగారు చీరా, జాకెట్టు తీసుకురమ్మని చెప్పవచ్చు–తీసుకురాకు. నీ జీతం డబ్బులు ఎన్నింటికి పెడతావు నాయనా. ఇదేమైనా ధర్మసత్రమా యేమిటీ?" అంత వరకూ కళ్ళుమూసుకొని పడుకున్న మనిషి, ఈ మాటలు కళ్ళు త్రిప్పుతూ చెప్తోంటే తల్లి బుద్ధికి మనసులోనే నవ్వుకున్నాడు.

"అలాగే నమ్మా నేనుమాత్రం ఎక్కడినుంచి తెచ్చి పెట్టను? నాకు వచ్చే జీతం నాలుగు వందలు ఎన్నింటికి పెట్టగలను? లలితతో అలాగే చెబుతాను. నోరు మూసుకుంటుందిలే?" నెమ్మదిగా అని, వంటగదిలోకి వచ్చాడు.

వంటగది అంతా సందడిగా ఉంది కబుర్లతో. ఉన్నవాళ్ళు ఇద్దరుపిల్లలే ఐనా అల్లరి అరవై మంది చేసినంత.

అమ్మకు భోజనం పెందలకడనే పెట్టు అందామను కుంటుండగానే, అన్నం కంచం, కూర గిన్నె తీసుకొని నవ్వుతూ కళ్ళతోనే వచ్చారా, అన్నట్టు పలకరించి అత్తగారి దగ్గరకు వెళ్ళింది లలిత.

రామారావు టేబుల్‌మీద ఉన్న ఫ్లాస్కులోని టీ కప్పులో పోసుకొని మరదలితో మంచీ చెడ్డా మాట్లాడుతూనే టీ త్రాగి తన రూం చేరుకున్నాడు.

రాత్రి తొమ్మిది గంటలు దాటింది.

రామారావు తన గదిలో ఏవో పుస్తకాలలో తల దూర్చాడు.

దానికి ప్రక్క గదిలోనే లలిత చెల్లెలితో ఏవో పుట్టింటి విషయాలు, చిన్ననాటి సంగతులు నెమరువేసుకుంటోంది.

పిల్లలిద్దరూ మంచి నిద్రలో వున్నారు.

"రామం....రామం చెల్లాయి వచ్చిందిరా." అన్నపూర్ణమ్మ సంతోషంతో గట్టిగా పిలుస్తోంటే



కర్ణాటక సివిల్ డిఫెన్స్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్- ఇటీవల ఒక నూతన ప్రక్రియను ప్రారంభించింది. ఏమిటంటే-'సాంఘిక రక్షణ'లో ఇల్లాళ్ళకు శిక్షణ ఇవ్వడం !

ఈ రక్షణ స్వచ్ఛందమైనది. ప్రజలకు అవసరం వచ్చినప్పుడు, కష్టం వచ్చినప్పుడు, తుఫానులు, కరువు, వరదలు, ప్రమాదాల్లాంటివి ఏర్పడినప్పుడు- ఈ రక్షణ సంస్థ వెళ్ళి సహాయపడుతుంది.

ప్రజలకు ఇలాంటి తర్ఫీదు ఇవ్వడానికి మన దేశంలో సివిల్ డిఫెన్స్ ట్రైనింగ్ సెంటర్స్ చాలా చోట్ల వున్నాయి.

కర్ణాటక సివిల్ డిఫెన్స్‌వారు–ఇల్లాళ్ళకు కూడా ఈ శిక్షణ ఇవ్వడం ఎంతో అవసరం అని భావించారు – ఇళ్ళల్లోనే ఎన్నో ప్రమాదాలు జరగడానికి అవకాశాలున్నాయి కాబట్టి !

ఈ శిక్షణాలయం – ఇల్లాళ్ళకు ఇలా శిక్షణ ఇవ్వబోతున్నట్టు ప్రకటించగానే, ఎందరో ఉత్సాహం చూపించారు. రోజుకు రెండు గంటల చొప్పున, పది రోజులపాటు జరిగిన తొలి 'శిక్షణా కాలం'లో చాలామంది ఇల్లాళ్ళు తర్ఫీదయినారు. ఆ ఇల్లాళ్ళ వయసులు 20 నుంచి 35 వరకూ వున్నాయి. వాళ్ళల్లో చాలామంది యస్. యస్. యల్. సి. పాసయినవాళ్ళు.

పది రోజులపాటు జరిగే ఈ 'కోర్స్'లో ప్రథమ చికిత్స, కృత్రిమ శ్వాస కల్పించడం, విష జంతువులు కరిచినప్పుడు చికిత్స చెయ్యడం, వయసు మీరినవారికీ, అనారోగ్యంతో బాధపడేవారికీ- అత్యవసరమైన సహాయాలు చెయ్యడం, ఇళ్ళల్లో జరిగే అగ్ని ప్రమాదాలకు వెంటనే చికిత్స చెయ్యడం వంటివి, ఎన్నో నేర్పుతారు.

తొలి విడతలో చాలామంది శిక్షణ పొందిన తర్వాత, అది చూచి చాలామంది తామూ అలాంటి శిక్షణ పొందడానికి ఉత్సాహం చూపారు. ఇప్పుడు ఆ శిక్షణ కేంద్రం–ఒక్కో ప్రాంతంలో శిక్షణకు ఉత్సాహం చూపగలిగేవాళ్ళు 30, 40 మంది గనక వుంటే – వాళ్ళందరికీ అందుబాటుగా వుండేట్టుగా ఆయా ప్రాంతాల్లోనే శిక్షణ ఇస్తున్నది....

—క. కు

విశాఖపట్నం పోర్టుట్రస్టు కంచరపాలెం క్వార్టర్స్‌లో శారదా మహిళా సమాజం — బొమ్మల కొలువు పెట్టడమనే సాధారణ సంప్రదాయానికి ఈ దసరా వేడుకల్లో సరికొత్త ప్రయోగబలంతో ఒక కమనీయమైన ఎగ్జిబిషన్‌ని రూపొందించారు. కాలనీలో దాదాపు రెండు వందలు గృహాలున్నాయి. ఈ గృహిణులందరు పోగు చేసిన బొమ్మల్లో ఉత్తమమైన వాటిని ఏరి సంప్రదాయ పద్ధతిలో చేర్చి పెట్టడంతో వందమంది కవుల అందమైన పద్యాలను ఒకచోట సంకలించినట్టుంది....

మిక్కిలి నిపుణతతో శ్రీ పి. శేషగిరిరావు (లోగడ పోర్టు ఉద్యోగి) చేసిన దారు చిత్రాలు (వుడ్‌క్రాఫ్ట్స్) ఈ బొమ్మల కొలువుకు ఒక ప్రక్కన అమర్చారు. ఇవి నూటికిపైగా వున్నాయి. వీటన్నిటినీ కళాఖండాలుగా పేర్కొనవచ్చు. వీటిని చూసి, కళా హృదయుడైన శ్రీ బి. కె. రావు (పోర్టుట్రస్టు మాజీ చేర్మన్) "ఇన్నాళ్ళూ యితణ్ణి ఎక్కడ దాచారండి?" అనడం గొప్ప అభినందన!

ఇక్కడి పురుషులంతా పోర్టు ఉద్యోగులు; అధికారులు. దానికి చిహ్నంగా, రేవు కార్యకలాపాలు జరిగే స్థలాన్ని, అక్కడున్న శ్రీ వేంకటేశ్వరాలయం, ఆ పక్కనే ఎంట్రన్స్‌చానల్‌లోంచి వస్తున్నట్టు కనపడే భారీవాక, వాకలోంచి దిగిన సరకును రవాణాచేసే ట్రక్కులు; ఈ దృశ్యాలన్నీ మట్టితో కట్టారు— ఈ కాలనీ మహిళలు. అవన్నీ నాలుగు కాలాలపాటు దాచవలసిన శిల్ప సంపదతో నిర్మించబడ్డాయి. కాని దాచడానికి వీల్లేనివి అయిపోయాయి.

ఆ మహిళలు ఆ దృశ్యాలని రూపొందిస్తున్నప్పుడు అంత కళాత్మకంగా వస్తాయని ఊహించి వుంటే వాటి నిర్మాణానికి కేవలం మట్టి, ఇసుక కాక కనీసం ప్లాస్టరాఫ్ పారిస్ ఉపయోగించేవారేమో అనిపించింది.

ఉదయం తొమ్మిది గంటల్లోగానే ఆఫీసులకు వెళ్ళిపోయే పురుషులు సాయంకాలం ఐదున్నర అయితేనేగాని ఇళ్ళకు రాలేరు. ఈ లోగా తమకేర్పడిన తీరిక సమయాన్ని వృథా చేయకుండా ఈ కాలనీ మహిళలు, చీరల మీద బుటాలు డిజైన్లు లేసులు కుట్టడాన్ని సాధన చేసేరు. కొందరు, రంగు రంగుల ప్లాస్టిక్ వైర్లతో అత్యంత ఆధునికమైన డిజైన్లలో హాండ్‌బ్యాగులు, పర్సులు మొదలైనవి అల్లి తమ నైపుణ్యాన్ని చూపారు. కొందరు, వాటర్, ఆయిల్ కలర్సుతో పెయింటింగులు వేశారు. అలా తయారైనవాటిలో మిక్కిలి కళాత్మకంగా వుండే వాటిని ఈ ప్రదర్శనలో అమర్చారు.

ఇక్కడ ఏటేటా ముగ్గులపోటీ; గృహపారిశుద్ధ్యపోటీ మొదలైనవి జరుగుతాయి. ఆ విధంగా ఈ మహిళల మధ్య ఒక నూతన చైతన్యం నెలకొని, ఈ ప్రదర్శనకు అవకాశాన్నిచ్చేయి. శారదా మహిళా సమాజంవారి ఈ ప్రదర్శన నిర్వాహకురాలు శ్రీమతి కళారామకృష్ణ బహుధా అభినందనీయురాలని, పలువురు ప్రశంసించారు.

ఈ ప్రదర్శన అక్టోబరు 13 నుండి 21 వరకు జరిగింది. రోజూ ఒక వెయ్యిమంది చూశారు.

—సత్యభామ

ముగ్గురూ చావట్లోకి వచ్చారు.

అంతవరకూ ఓపికలేని దానిలా మంచానికి అతుక్కున్న మనిషి–కూతురిని, కూతురు ఇద్దరు ఆడపిల్లల్ని ప్రక్కన కూర్చోబెట్టుకొని కబుర్లు చెప్పేస్తోంది. ముద్దులు పెట్టేసుకుంటోంది.

ఆ దృశ్యం చూస్తోంటే లలితకి ఒళ్లు మండింది.

బంధువుల్లో ఎంత తేడా? కోడలి తరపు వాళ్ళు వస్తే పలకరించినా పలకని మనిషి, తన వాళ్ళు వస్తే ఎంత ప్రేమ, ఎంత ఆదరణ! కొడుకు బిడ్డలతో నవ్వుతూ మాట్లాడని మనిషి కూతురు బిడ్డలంటే ఎన్ని ముద్దులొలకబోస్తోంది!

ఆలోచనలతో గుమ్మం దగ్గరే నిలబడింది లలిత.

"బావగారు రాలేదామ్మా?" అంటూ రామారావు వచ్చి ఎదురుగా ఉన్న స్టూల్ మీద కూర్చున్నాడు.

"ఆయనకు ఏవో పొలం పనులు ఉన్నాయట ఖాళీ లేదంటే నేనే పిల్లలను తీసుకు వచ్చానన్నయ్యా." లక్ష్మి నవ్వుతూ చూచింది అన్నగార్ని.

లక్ష్మి–తల్లివంటిది కాదు. సరదా, కలుపుగోరుతనం కలది. గౌరవ మర్యాదలు తెలిసినది.

తనకంటె చిన్నది కావడంతో ఆడపడుచు ఐనా లక్ష్మీ అంటూ పేరు పెట్టి పిలుస్తుంది లలిత.

"వదినా....బాగున్నావా?" మంచం మీది నుంచి లేచివచ్చి లలిత చేయి పట్టుకుంది.

లలిత, జయలక్ష్మి కూతురుతో మాట్లాడుతుంటే ముసలావిడ మనసులోనే విసుక్కుంటోంది.

"అమ్మా....ఇంత రాత్రివేళ లక్ష్మి ఒంటరిగా చిన్నపిల్లలతో వచ్చింది. రేపు వస్తే ఏం పోయేది?"

కొడుకు మనసులో ఏమనుకొని అన్నాడో తెలుసుకోకుండా తేల్చి పారేసింది అన్నపూర్ణమ్మ–

"ఆఁ ఐస్సు ప్రయాణాలకి భయమేమిటి? కూడా మగవాళ్ళే రావాలనుకుంటే ప్రయాణాలు ఐనట్టే. ఐనా ఈ రోజుల్లో దొంగల భయం ఏముందిలే? పట్టపగలులా ఎక్కడ చూచినా కరెంటు లైట్లేగదా. భయపడే రోజులు కావురా నాయనా ఇవి. ఆడపిల్ల ఒంటరిగా వచ్చిందని భయపడ్డావా యేమిటీ?" తల్లి నవ్వుతూ అంటున్న మాటలకు రామం నోరు తెరిచాడు.

అంతకుముందు సాయంత్రంవేళ జయలక్ష్మి వచ్చినప్పుడు, ఒంటరిగా వచ్చిందని 'ఆడదానికి ఎంత ధైర్యంరా నాయనా?' అంటూ విమర్శించిన తన తల్లికి రెండు నాలుకలు ఉన్నాయేమో అనుకుని నవ్వుకున్నాడు.

తల్లీ, కూతురు, కొడుకు కబుర్లు చెప్పుకుంటుంటే — లలిత, జయలక్ష్మి గబగబా వంట చేశారు.

భోజనాలయ్యాక అందరూ తీరిగ్గా కూర్చున్నారు.

"రేపే వెళ్ళిపోతాను. నేను ఉండాలని రాలేదు." అంటున్న కూతురి మాటలతో ముసలావిడ మునిగిపోయింది. ఎంతో బెంగపెట్టుకున్న దానిలా ఆమె ముఖం విచారంతో నిండిపోయింది.

"ఆఁ వెళ్ళొచ్చులే. పదిరోజులైనా ఉండకుండా వెళ్ళిపోతావా యేమిటీ? నువ్వు వచ్చి నాలుగు నెలలే ఐనా నాలుగు యుగాల్లా ఉన్నామే తల్లీ, నీ దగ్గరకే వచ్చి చూడాలనుకుంటున్నాను నేను. ఉన్నదానివి ఒక్కకూతురివి!" అంటూ కన్నీళ్ళు పెట్టుకుంది.

"ఔను లక్ష్మీ....ఇప్పుడు వచ్చి రేపే వెళ్ళిపోతే మాకూ బాధగా ఉంటుంది. ముఖం చూపించి వెళ్ళిపోతావా?"

"లేదు వదినా... అక్కడ ఆయనకు పొలం పనులు ఆపీనూ. రేపు సాయంత్రానికి ఆయన వచ్చెయ్యమన్నారు."

"ఆ మొగుడేదో అంటే జడిసిపోతావేమిటే? తిడితే నాలుగు తిడతాడు, గాలికి పోతాయి. మగాళ్ళ మాటలు లెక్క చేస్తే నువ్వెక్కడా ఉండలేవు."

కోపంగా అంటున్న తల్లి మాటలకు, రామా

రావుకు మగవాడి పౌరుషం వచ్చినా ఏమనీ అనలేక నవ్వుతూ భార్య ముఖాన్ని చూచాడు.

లలిత కూడా అతనివైపే చూస్తోంది.

'మీ అమ్మగారు అన్నట్లు నేనూ మీ మాటలు లెక్కచేయను' అన్నట్లు ఉన్నాయి ఆ చూపులు.

రామారావు మాట మార్చేశాడు.

"అవతల బావగారు బాధపడతారని లక్ష్మి అంటోంటే నువ్వు ఆగమంటావు దేనికి....? మనం ఆపుచేసినా అది ఆగవద్దూ? దాని సంసారం దానిది. ఇక్కడ ఉంటే అక్కడ అదాయాలు తోడికోడళ్ళకే." నవ్వుతూ చెల్లెలిని చూచాడు అతను.

"ఊరుకో అన్నయ్యా అంతగా మాటలు కట్టెయ్యాడం లేదులే–నీ మాటలే కాని. ఉమ్మడి సంసారం....అదో పెద్ద సామ్రాజ్యం." లక్ష్మి మాటలతో అందరూ నవ్వకుండా ఉండలేక పోయారు లక్ష్మి అత్తారిల్లు తలచుకొని.

అందరూ నిద్రపోతున్నా అన్నపూర్ణమ్మ మాత్రం రాత్రంతా కూతురిని ప్రక్కలో పడుకో బెట్టుకుని సోది చెబుతూనే ఉంది.

తెల్లవారింది. ముఖం కడుక్కుని వస్తున్న కొడుకును మంచం మీద కూర్చోమని పిలిచింది.

"రామం....చెల్లాయికి, పిల్లలకు మంచి బట్టలు తీసుకురారా, వచ్చే దీపావళికి కట్టుకుంటారు!" అధికారంతో ఆజ్ఞాపిస్తోన్న తల్లి మాటలతో రామారావు గొంతులో వెలక్కాయ పడింది.

'పెళ్ళి అయిన తరువాత మొదటిసారిగా వచ్చిన మరదలికి బట్టలు తీసుకువస్తావేమో. తీసుకురాకు. నీ జీతం డబ్బులు ఎన్నింటికి పెడతావు నాయనా' అని హితబోధలు చేసి జాలిపడ్డ అమ్మ మాటలు ఎంతలో ఎంతగా మారిపోయాయి!

తల్లి బుద్ధికి అసహ్యమేసింది.

"ఇప్పుడెందుకమ్మా బట్టలు, నాలుగునెలల క్రింద పెట్టాంగదా? వచ్చినప్పుడల్లా దాని మీది ప్రేమతో నువ్వు పెట్టమంటుంటే డబ్బు ఎక్కడి నుంచి వస్తుందే–నేను చావనా? బ్రతకనా?" అంటూ కోపంతో అరిచి చెప్పాలనుకున్నాడు.

మూతపడిన పెదవులు విడిపోవడానికి ఇష్టపడలేదు.

కారణం—

ఏడుపులు, అరుపులు, శాపనార్థాలు, పోట్లాటలు.

నీరసంగా మంచం మీది నుంచి లేచాడు.

ఏ బాధలేని అన్నపూర్ణమ్మ లక్ష్మికి బట్టలు తెస్తాడు అనే ఆనందంతో కళ్లు మూసుకుంది.

పదయ్యేసరికి మళ్ళీ స్కూలుకు పోవాలికనుక కాఫీ గొంతులో పోసుకుని, డబ్బు ఎప్పుడిచ్చినా అరువు దొరికే క్లాత్ స్టోర్స్‌కు బయలుదేరాడు.

భర్త బట్టలషాపుకే వెళ్తున్నాడని తెలుసుకున్న లలిత ఏదో చెప్పాలనుకుని కలవరపడింది కాని, నోరు విప్పలేకపోయింది.

జయ ఒక్కగానొక్క చెల్లెలు. పెళ్ళి అయ్యాక ఇదే రావడం. ఒక చీరా, జాకెట్టు ఐనా పెట్టకుండా పంపితే ఏం బాగుంటుంది?

కాని ఎలా అడగడం?

'లక్ష్మికి, ఇద్దరు ఆడపిల్లలకి తెచ్చేసరికే బాధపడతారు, మళ్ళీ నేను కూడా ఎలా చెప్పను? సరిగ్గా జయ వచ్చే రోజుకే లక్ష్మి రావాలా!' మనసులోనే తీరని బాధపడుతూ మతిలేనిదానిలా తిరుగుతూనే పని చేసుకుపోతోంది లలిత.

లక్ష్మికి, పిల్లలకు పెట్టవలసిన బట్టలు తల్లి మంచం మీదకు విసరి, భోజనం అయిందనిపించి

## వార్తలు

గాంధీజయంతి వారోత్సవాల సందర్భంగా విశాఖపట్నం బా-బాపూ (మహిళా) సేవాసంఘం గాంధీ పీస్ ఫౌండేషన్ కేంద్రాల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాలలో మహిళా సంక్షేమ దినోత్సవం అక్టోబరు 5 వ తేదీన బా-బాపూ భవనంలో వైభవంగా జరిగింది. ఈ సభకు అధ్యక్షత వహించిన డా॥ ఇందిరాబాయి స్త్రీ సంక్షేమం పట్ల శ్రీ కందుకూరి వీరేశలింగం మొదలైన మహనీయులు చేసిన అఖండ సేవలను ప్రస్తావించి వారికి జోహరు లర్పించారు. వరకట్నాల వల్ల అవివాహితులైన స్త్రీలు ఎదుర్కొంటున్న బాధలు, ఉద్యోగాలు చేస్తున్న నేటి స్త్రీల సమస్యలు సవివరంగా చర్చించారు. కార్యదర్శి కుమారి పి. జగన్మోహిని సభ్యలకు వివిధ సేవా సంస్థల కార్యకర్తలకు స్వాగత వచనాలు పలికారు. కుమారి రఘునాధమ్మ, సూర్యకుమారి, శివశ్రీగారలు గాంధీజీపై భక్తిగేయాలను పాడగా, సెయింట్ జోసెఫ్స్ విమెన్స్ కాలేజీ లెక్చరర్ శ్రీమతి నాగమాంబ మధురంగా గానం చేశారు. అదే కాలేజీ విద్యార్థినులు సుబ్బలక్ష్మి, భారతి, పద్మ ఈనాటి అవివాహిత స్త్రీల సమస్యలు, స్త్రీలపట్ల పురుషులు చూపుతున్న ఉదాసీన భావం, స్వార్థచర్యల గురించి వివరించారు. సంయుక్త కార్యదర్శి శ్రీమతి శారదారెడ్డి వందన సమర్పణతో సభ ముగిసింది.

*

వారోత్సవాలలో ఏడవ రోజున జరిగిన బాలల కార్యక్రమానికి శ్రీ వేణుగోపాలరెడ్డి అధ్యక్షత వహించారు. బాలబాలికలు లలిత సంగీతం, చిత్రలేఖనం, విచిత్ర వేషధారణ, వక్తృత్వపోటీలలో పాల్గొన్నారు. శ్రీమతి కమలా రామకృష్ణచెట్టి విజేతలకు బహుమతి ప్రదానం గావించారు. పల్నాటి యుద్ధం, బుర్రకథ, ఫిల్ముషోల అనంతరం శ్రీమతి శారదారెడ్డి వందన సమర్పణ చేశారు.

*

విశాఖపట్నం లయన్ లేడీస్‌క్లబ్బు, లియోక్లబ్బుల సంయుక్త ఆధ్వర్యాన రాంనగర్‌లోని విశాఖ సేవా సదన్ అప్పర్ ప్రయిమరీ స్కూలు ఆవరణలో ఇటీవల ఉచిత వైద్యసహాయ శిబిరం నిర్వహించబడింది. ఈ శిబిరానికి పాస్టుజిల్లా గవర్నరు లయన్ డి. వి. సుబ్బారావు ప్రారంభోత్సవం జరుపగా లయన్ లేడీస్‌క్లబ్బు అధ్యక్షురాలు డా॥ ఎ. హైమవతీదేవి అధ్యక్షత వహించారు. స్కూలు కరస్పాండెంటు, కమిటీ కార్యదర్శి కుమారి పి. జగన్మోహిని, తదితర ఉపాధ్యాయినీ వర్గం ఈ శిబిర నిర్వహణలో సహకరించారు. సుమారు అయిదుగంటల పాటు జరిగిన ఈ కార్యక్రమంలో వెయ్యిమందికి పైగా రోగులను పరీక్ష చేసి వైద్య సదుపాయాన్ని అందించారు. లయన్ లేడీస్‌క్లబ్బు తరఫున రిటైర్డ్ సివిల్ సర్జన్ డా॥ డి. ఇందిరాబాయి, లయన్‌లేడీస్ డా॥ ఎమ్. సన్యాసమ్మ, డా॥ జియామెహదీ పాల్గొన్నారు. సరియైన పోషకాహారం లేక, అనారోగ్యకరమైన పరిసరాల్లో నివసిస్తూండటం వలన కలిగే ఎనీమియా వంటి వ్యాధులతో బాధపడుతూన్న గర్భిణీ స్త్రీలకు, చంటి పిల్లల తల్లులకు, కడుపులో నులి పురుగువల్లను, చర్మవ్యాధులతోను, ఎ అండ్ బి విటమినుల లోపంవల్ల కలిగే వ్యాధులతోను బాధపడుతున్న పిల్లలకు తగిన వైద్యచికిత్స చేసి, ఉచితంగా మందులూ, టానిక్కులూ ఇచ్చారు. మూడువందల మందికి పైగా పిల్లలకు బి. సి. జి. టీకాలు వేసారు. లియో జయన్‌మీనన్ వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.

—విలేకరి

స్కూలుకు వెళ్ళిపోయాడు రామారావు.

సాయంత్రం స్కూలు నుంచి వస్తున్న రామారావు వీధి ద్వారం దగ్గరే ఆగిపోయాడు.

''కొట్టు చివుకుగుడ్డలూ, వలాసం గుడ్డలూను! ఎక్కడ తేరగా దొరికాయో? యాభై రూపాయల చీరలా ఉంది. ఒక వంద పెట్టి తెస్తే ఏం పోయిందో? నానావాళ్ళూ కొంపలోపడి తింటుంటే లేనిది ఒక్క మంచి చీర పెడితే ఏం పోయిందీ! ఒక్క రోజుతో అంతా దాన్ని తరిమేసారు. ఆది ఈ కొంపలో తినతగదు. తినేవాళ్ళంతా కొంపను నాశనం చేస్తుంటే ఈ పిచ్చాడికి తెలియడంలేదు. వాడలాంటి వాడవ్వబట్టే నానావాళ్ళూ వచ్చేది.''

అంతమేలేని తల్లి మాటల మూలంగా వస్తున్న కోపాన్ని అణుచుకుంటూ, అప్పుడే వచ్చినవాడిలా దగ్గుతూ గడపదాటాడు.

కొడుకు వచ్చాడన్న సంగతి తెలియడంతో ఆమె నోరు మూతపడింది.

'ఊ....ఊ....' అంటూ మూలుగుతూ కళ్ళు మూసుకుంది.

''అమ్మా........ఒంట్లో బాగోలేదా, డాక్టర్ని తీసుకురానా?'' అంటూ తల్లి మంచం మీద కూర్చున్నాడు.

ఒకవైపు తల్లి బుద్ధికి ఒళ్ళు మండుతున్నా, ఎంతో ప్రేమతో, ఎన్నో ఆశలతో పెంచి పెద్ద చేసిన తల్లిని ఆ వయసులో బాధ పెట్టకూడదని, ఆ మాత్రమైనా ప్రేమ చూపకపోతే కన్నతల్లి కుమిలిపోతుందని, తన కోపం లోలోనే దాచుకున్నాడు.

"డాక్టరెందుకులే నాయనా. మాయదారితలపోటు కాస్సేపటికి పోతుందిలే. రామం – చెల్లి వెళ్ళి పోయిందిరా. పిచ్చిది....నాలుగు రోజులైనా వుండకుండా వెళ్ళిపోయింది.''

తల్లి మాటలకి అంతు ఉండదని నెమ్మదిగా లేచి వంటగదిలోనికి వచ్చాడు.

లలిత భర్తవంక చూసి మామూలుగానే ఒక చిరునవ్వు విసిరింది వంట చేస్తూనే.

జయలక్ష్మి పిల్లలకు స్నానాలు చేయిస్తోంది.

టీ త్రాగి నెమ్మదిగా గదిలోనికి వచ్చి కూర్చున్నాడు.

ఏదో తెలియని విచారంతో అతని హృదయం బరువెక్కింది.

'అమ్మ మనస్తత్వం ఏమిటి? మరీ అంతలా మాట్లాడేస్తోంది. లలిత పరాయిదా? అయినా అమ్మకు ఈ బుద్ధి ఏమిటి? కొడుకు మీద ఉండే ప్రేమ కొడుకు భార్య మీద ఎందుకు చూపలేదు? లోకంలో ప్రతీ అత్తా ఇంతేనా? లలిత మనస్సు మంచిది కనుక లోపల ఏమనుకున్నా పైకి మామూలుగా తిరుగుతోంది. అదే కోడలు గయ్యాళి అయిననాడు ఇల్లు అంతా గోలగా మారుతుంది. మధ్యన నేను చచ్చేవాడిని. అయినా అమ్మ మాటలు వింటే జయలక్ష్మి ఏమనుకుంటుంది? ఒకసారి వచ్చిన బంధువులు మళ్ళీ వస్తారా?' పడక కుర్చీలో, తల వెనక్కు వాల్చి కళ్ళు మూసుకుని ఆలోచనలో పడ్డ రామారావు లలిత మాటలతో కళ్ళు తెరిచాడు.

"జయ రేపు వెళ్ళిపోతానంటోందండీ" అనగలిగింది కాని 'ఒక చీర పెడితే బాగుంటుందండీ', అందామన్నా నోరురాక నిలబడిపోయింది ఆమె.

తడి చేతులు పైటకొంగుతో తుడుచుకునే నెపంతో భర్త ముఖాన్ని చూడకుండా తల వంచుకుంది.

లలిత చెప్పకున్నా ఆమె ముఖంలోని భావాలు గ్రహించి నవ్వుతూ కుర్చీలోంచి లేచాడు.

"ఔను లలితా, జయ పెళ్ళి అయిన తరువాత రావడం ఇదేగా! అందుకే చీరా, జాకెట్టు తెచ్చాను. పసుపు కుంకుమలతో ఇవి పెట్టి పంపు", అంటూ డ్రాయర్ సొరుగులో నుంచి చిన్న పేకెట్ తీసి భార్యకివ్వబోయాడు.

భర్త మంచితనానికి పట్టరాని ఆనందంతో కొయ్యలా నిలబడిపోయింది లలిత-భర్త ముఖాన్ని చూస్తోందే కాని పేకెట్ అందుకోలేకపోయింది!

''లలితా, మీ అత్తగార్కి తెలిస్తే నన్ను బ్రతకనివ్వదు, చాటుగా పెట్టి పంపాలి మరి. ఏమిటో లలితా, కొడుకులంటే కొండంత ప్రేమ చూపుతారు. కాని కోడలి వైపు నుంచి చూస్తే అత్తలంతా ఇంతే! మా అమ్మ ఏదో అంటుందని బాధపడకు!'' విచారంతో అర్థిస్తున్న రామారావు ఆ పేకెట్టును భార్య చేతిలో పెట్టాడు.

''ఆడదానికి కావలసింది అత్త కాదండి. బంగారంవంటి భర్త. ఆ నీడలో ఎన్ని కష్టాలైనా హాయినే అందిస్తాయి!'' అంటూ ఏవేవో అందామనుకున్నా, పెదవులు విడిపోనంటుంటే తన రెండు చేతులతో భర్తను చుట్టుకుంది పందిరిని అల్లుకున్న లతలా–లలిత. □

